ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 190 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 18 అక్టోబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## సుప్రీం తదుపరి చీఫ్ జస్టిస్‌గా సంజీవ్ ఖన్నా

**కేంద్రానికి సిఫార్సు చేసిన సిజెఐ డివై చంద్రచూడ్**

న్యూఢిల్లీ, అక్టోబర్ 17 (ప్రభాత ఉదయం): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ పదవీకాలం నవంబర్ 10తో ముగియనుంది. దాంతో తన తరువాత సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ఆయన కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. సుప్రీంకోర్టులో చంద్రచూడ్ తర్వాత సీనియర్ జడ్జిగా ఖన్నా ఉన్నారు. జస్టిస్ చంద్రచూడ్ సిఫార్సులను కేంద్రం ఆమోదిస్తే 51వ భారత ప్రధాన న్యాయమూర్తిగా సంజీవ్ ఖన్నా నియమితులు కానున్నారు. నియమితులైతే 2025 మే 13 వరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవిలో ఉంటారు. 2019లో ఢిల్లీ హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఖన్నా పదోన్నతి పొందారు. నిబంధనల ప్రకారం జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రతిపాదనను కేంద్ర న్యాయశాఖ పరిశీలించి ప్రధానమంత్రికి పంపిస్తుంది. ప్రధాని మోదీ ఆమోదం తరువాత రాష్ట్రపతి వద్దకు వెళుతుంది. రాష్ట్రపతి ఆమోదముద్రతో తదుపరి ప్రధాన న్యాయమూర్తి ఎంపిక ఖరారవుతుంది. 2022 నవంబర్ 9వ తేదీన చీఫ్ జస్టిస్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జస్టిస్ డీవై చంద్రచూడ్ ఎక్కువకాలం ఈ పదవిలో ఉన్నారు.

## మూసీ సుందరీకరణ కాదు..
# మూసీ నది పునరుజ్జీవం



### మూసీ మురికి నుంచి పేదలను కాపాడుతాం

**మూడు నెలలు కెటిఆర్, హరీష్, ఈటెల అక్కడ ఉంటారా**
**వారికి సకల సౌకర్యాలు కలిగించి ఉంచుతాం**
**పేదలను తరిమి కొట్టేంత దుర్మార్గం చేయలేదు**
**మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ బాధితులను హింసించింది మరిచారా**
**మీడియా సమావేశంలో వివరణ ఇచ్చిన సిఎం రేవంత్**

హైదరాబాద్, అక్టోబర్ 17 (ప్రభాత ఉదయం): తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవనమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిని వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న పార్టీలపై ఆయన ఆగ్రమం వ్యక్తం చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూసీనది అభివృద్ధి ప్రాజెక్టు వివరాలు వెల్లడించారు. 'మూసీ దుర్గంధంలో మగ్గిపోతున్న వారికి మెరుగైన జీవితం ఇవ్వాలని ఈ ప్రాజెక్టు తలపెట్టామని అన్నారు. నగరం మధ్య గుండా నది వెళ్తున్న రాజధాని మరొకటి ఈ దేశంలో లేదు. దాదాపు 300 కి .మీ ప్రవహించే మూసీకి ఎంతో చరిత్ర, విశిష్టత ఉంది. మేం చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవం. కొందరు మెదడులో మూసీలో ఉన్న మురికికంటే ఎక్కువ విషం నింపుకొన్నారు. మెదడులో విషం నింపుకొని మూసీ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ఈ ప్రభుత్వ ఆలోచన. మల్లన్న సాగర్, వేములఘాట్‌లో ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోవాలి. రాత్రికి రాత్రే పోలీసులతో కొట్టించి, గుర్రాలతో తొక్కించి మేం ఖాళీ చేయించటం లేదు. రంగనాయక్‌సాగర్, కొండపోచమ్మ.. ఇలా ఎక్కడికైనా నేను వస్తా. నేడు మూసీ నది కాలుష్యానికి ప్రతీకగా మారింది. 1600కు పైగా నివాసాలు పూర్తిగా మూసీ నది గర్భంలో ఉన్నాయి. మల్లన్నసాగర్‌లో మునిగిపోయిన 14 గ్రామాల్లో ఎలా వ్యవహరించారో తెలుసా? మేం ఉన్నపళంగా, నిర్దయగా ఎవరినీ ఖాళీ చేయించలేదు. నిర్వాసితులకు రెండుపడక గదుల ఇళ్లు కేటాయించి, రూ.25వేలు ఇచ్చాం. చెరువుల్లో అక్రమంగా నిర్మించుకున్న భవనాలనే హైడ్రా కూల్చింది. మూసీ పరివాహకంలో ఎవరి ఇళ్లను హైడ్రా కూల్చలేదు. చినుకు పడితే చాలు హైదరాబాద్‌లో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. రోడ్లపై పడిన వర్షపు నీరు చెరువుల్లోకి, నదుల్లోకి చేరాలా.. అలాగే రోడ్లపై ఉండాలా?' అని ..మిగతా 2లో




## బిఆర్ఎస్ తెలంగాణ అస్తిత్వ పార్టీ

**తెలంగాణ కోసం కొట్లాడేది కేవలం మన పార్టీయే**
**ఇది కెసిఆర్, కెటిఆర్‌దో కాదు...తెలంగాణ ప్రజలది**
**కాంగ్రెస్ పాలనలో దోపిడీ పెరిగింది**
**బిజెపి మత రాజకీయాలు చేస్తోంది**
**బిఆర్ఎస్‌వి సమావేశంలో కెటిఆర్ విమర్శలు**

హైదరాబాద్, అక్టోబర్ 17 (ప్రభాత ఉదయం): రేవంత్ రెడ్డి ఉడుత ఊపులకు భయపడే ప్రసక్తే లేదు.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బంద్ అయితే.. సమాజం తరపున కొట్లాడడం బంద్ అయితే.. పేద ప్రజల తరపున మాట్లాడడం బంద్ అయితే తెలంగాణ మూగబోతది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎందుకంటే బీజేపోడు మాట్లాడడు. తెలంగాణన నాశనం చేసిన బీజేపోడు మెసలడు. బడే భాయ్ చోటే భాయ్ ఒక్కటే. పైననేమో జుమ్లా పీఎం.. ఇక్కడ్నేమో హౌలా సీఎం.. ఈయనకు ఏం తెల్వది.. ఆగమాగం అవుతున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్వీ సమావేశంలో కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దోచుకోవడంలో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఓ బిల్డర్ తనకు వద్దకు వచ్చి.. హైదరాబాద్‌లో కరెంట్ కనెక్షన్ కోసం 25 లక్షలు సమర్పించుకున్నట్లు చెప్పాడు. కాంగ్రెస్ నేతలు అందినకాడికి దోచుకుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. గత పది నెలల్లో అత్యంత కష్టకాలాన్ని ఎదుర్కొన్నాం. ఎవరూ ఊహించని విధంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ప్రతిపక్షంలో కూర్చుంటామని ఊహించలేదు. డిసెంబర్ 7న కేసీఆర్‌కు ప్రమాదం జరగడం.. మూడు నెలల పాటు ఇబ్బందికి గురయ్యారు. ఓ పది మంది ఎమ్మెల్యేలు ప్రలోభాలతో దొంగల్లో కలిసిపోయారు. మన ఆడబిడ్డ కవితమ్మను ఐదున్నర నెలలు జైల్లో పెట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో కొట్లాడినం, పోరాడినం కానీ ఎవరికీ లొంగలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించిన దానికి భిన్నంగా ఫలితాలు వచ్చాయి. ఇవాళ కేసీఆర్‌ను తలచుకుంటున్నారు. కేసీఆర్ సీఎంగా ఉంటే రైతుబంధు, బతుకమ్మ చీరలు వస్తుండే అని అనుకుంటున్నారు. కులమతాలకు అతీతంగా కేసీఆర్‌ను తలచుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్‌దో, కేటీఆర్‌దో కాదు.. ఇది తెలంగాణ ప్రజల గొంతుక అని కేటీఆర్ స్పష్టం చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష.. కేసీఆర్ నాయకత్వం, గులాబీ జెండానే తెలంగాణకు రక్షణ. ఈ పార్టీ మరో 75 ఏండ్ల పాటు ఒక డీఎంకే లాగా, శిరోమణి అకాలీదళ్ లాగా ఉంటది. ఈ పార్టీ మన తెలంగాణ ప్రజలది అని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో మనం జాగ్రత్తగా ఉండాలి. కాంగ్రెస్‌నే శత్రువుగా చూడాల్సిన అవసరం లేదు. తెలంగాణ సమాజానికి మరింత డేంజరస్ పార్టీ బీజేపీనే. మతాలను అడ్డంపెట్టుకుని, మతపరమైన రాజకీయాలు చేస్తూ.. దేవుడిని అడ్డుపెంట్టుకుని పిల్లలను రెచ్చగొడుతున్నారు. తెలంగాణకు చేసిందేమీ లేదు బీజేపీ. ఐఐటీ, ఐఐఎం, మెడికల్, నర్సింగ్ కాలేజీ ..మిగతా 2లో

## 23వ తేదీన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం

**కీలక అంశాలను చర్చించనున్న కేబినేట్**



హైదరాబాద్, అక్టోబర్ 17 (ప్రభాత ఉదయం): ఈ నెల 23వ తేదీన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సాయంత్రం 4 గంటలకు కేబినెట్ భేటీ జరగనుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. ఈ కేబినెట్ సమావేశంలో పలు అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించనుంది. హైడ్రా ఆర్డినెన్సుకు చట్టబద్ధత, రెవెన్యూ చట్టం, మూసీ బాధితులకు న్యాయం చేసే అంశం, వరద నష్టం, రైతు భరోసా అంశాలపై చర్చించనున్నట్లు ..మిగతా 2లో



## అట్టహాసంగా నాయబ్ సింగ్ సైనీ ప్రమాణం

**హాజరైన ప్రధాని మోడీ, అమిత్ షా, చంద్రబాబు**

చండీగఢ్, అక్టోబర్ 17 (ప్రభాత ఉదయం): హరియాణా ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. 90 అసెంబ్లీ స్థానాలకుగానూ 48 చోట్ల బీజేపీ గెలుపొందింది. గవర్నర్ బండారు దత్తాత్రేయ.. నాయబ్ సింగ్‌తో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ , ఏపి సిఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు. సీఎంతోపాటు అనిల్ విజ్, క్రిషన్ లాల్ పన్వార్, రావ్ నర్బీర్ సింగ్, మహిపాల్ ధండా, విపుల్ గోయెల్, అరవింద్ కుమార్ శర్మ, శ్యామ్ సింగ్ రాణా మంత్రులుగా ..మిగతా 2లో

## ఏపి సిఎస్‌కు నలుగురు ఐఏఎస్‌ల రిపోర్ట్

**డీవోపీటీ ఆదేశాల మేరకు నిర్ణయం**



అమరావతి, అక్టోబర్ 17 (ప్రభాత ఉదయం): డీవోపీటీ ఆదేశాల మేరకు నలుగురు ఐఏఎస్ అధికారులు గురువారం ఏపీలో రిపోర్టు చేశారు. తెలంగాణ హైకోర్టు డీవోపీటీ ఆదేశాలపై జోక్యం చేసుకునేందుకు నిరాకరించడంతో తెలంగాణ నుంచి రిలీవ్ అయిన ఆమ్రపాలి కాట, రోనాల్డ్ రోస్, వాణీ ప్రసాద్ , వాకాటి కరుణ ఏపీ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్‌ను కలిసి రిపోర్టు చేశారు. మరోవైపు ఏపీ నుంచి రిలీవ్ అయిన ఐఏఎస్ అధికారులు సృజన, హరికిరణ్, శివశంకర్‌లు బుధవారమే హదరాబాద్‌కు వచ్చి సీఎస్ శాంతికుమారికి రిపోర్టు చేశారు. కేంద్రం ఈనెల 9న ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఆలిండియా సర్వీసు అధికారులు తమకు కేటాయించిన రాష్ట్రాల్లో చేరాల్సిందేనంటూ కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఈ ఉత్తర్వులు ఆపాలని కోరుతూ తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్‌లు హైకోర్టుకు వెళ్లారు. క్యాట్ ఇచ్చిన ఉత్వర్వుల్లో జోక్యం చేసుకోబోమని హైకోర్టు తేల్చిచెప్పడంతో ఆమ్రపాలి కాట, రోనాల్డ్ రోస్, వాణీ ప్రసాద్, వాకాటి కరుణ ఏపీకి వెళ్లి సీఎస్‌కు రిపోర్టు చేశారు.

## రైల్ రిజర్వేషన్ కాల వ్యవధిలో మార్పులు

**రైల్ రిజర్వేషన్ కాల వ్యవధిలో మార్పులు**
**120 రోజుల నుంచి 60 రోజులకు కుదింపు**
**నవంబర్ ఒకటో తేది నుంచి అమలు**



న్యూఢిల్లీ, అక్టోబర్ 17 (ప్రభాత ఉదయం): టికెట్ రిజర్వేషన్లకు సంబంధించి భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ప్రయాణానికి 120 రోజుల ముందుగానే బుకింగ్ చేసుకునే సదుపాయం ఉండగా.. దానిని 60 రోజులకు కుదించింది. ఇందుకోసం ఐఆర్‌సీటీసీ నిబంధనల్లో మార్పులు చేసింది. నవంబర్ 1 నుంచి కొత్త నిబంధన అమల్లోకి రానుంది. అయితే, ఇప్పటికే బుకింగ్ చేసుకున్న వారికి మాత్రం ఎటువంటి ఇబ్బంది ఉండదని రైల్వే వర్గాలు పేర్కొన్నాయి. కొత్త నిబంధన నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నప్పటికీ.. అక్టోబర్ 31 వరకు బుకింగ్ చేసుకునే వారికి పాత నిబంధన వర్తిస్తుంది. తాజ్ ఎక్స్‌ప్రెస్ , గోమతి ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్ల బుకింగ్‌లో ..మిగతా 2లో



## షేక్ హసీనాపై అరెస్ట్ వారెంట్

**నవంబర్ 18లోగా హాజరు పర్చాలని కోర్టు ఆదేశం**

ఢాకా, అక్టోబర్ 17 (ప్రభాత ఉదయం): బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పై అరెస్టు వారెంట్ జారీ అయింది. ఆ దేశానికి చెందిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఈ వారెంట్ ఇచ్చింది. నవంబరు 18లోగా ఆమెను అరెస్టు చేసి తమ ఎదుట హాజరు పరచాలని ఐసీటీ చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తజుల్ ఇస్లాం తన ఆదేశాల్లో పేర్కొన్నారు. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. తర్వాత నుంచి ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. జులై 15 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన మారణహోమం, ఇతర నేరాల ఆరోపణలపై హసీనాకు వ్యతిరేకంగా ఐసీటీకి 60 ఫిర్యాదులు అందాయి. వాటిపై ట్రైబ్యునల్ ఇటీవల దర్యాప్తు ప్రారంభించింది. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆమెను బంగ్లాదేశ్‌కు ..మిగతా 2లో

# అట్టహాసంగా నాయబ్ సింగ్ సైనీ ప్రమాణం

మొదటి పేజీ తరువాయి...

ప్రమాణ స్వీకారం చేశారు. ఇక్కడ సీఎం సహా 14 మంది మంత్రులు ఉండే అవకాశం ఉంది. సైనీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగియడంతో పంచ్‌కులాలో ప్రధాని మోదీ అధ్యక్షతన ఎన్డీయే విస్తృత సమావేశం జరిగింది. దీనికి పవన్ కల్యాణ్ హాజరు కానున్నారు. జమిలి ఎన్నికలు, జనగణన, ఉమ్మడి పౌర స్మృతి తదితర కీలక అంశాలపై ఈ భేటీలో చర్చించే అవకాశాలున్నాయి. బీజేపీకి, ఎన్డీయే పార్టీలకూ మధ్య సమన్వయానికి ఒక కమిటీ ఏర్పాటు చేయవచ్చని, ఇదే సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబుకు కీలక బాధ్యతలు అప్పగించవచ్చని చర్చ జరుగుతోంది. రాష్ట్రంలోని 90 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ 48, కాంగ్రెస్ 37 సీట్లలో గెలుపొందాయి. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ హరియాణాలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని అంచనా వేసింది. 90 స్థానాల్లో 67.9 శాతం పోలింగ్ నమోదైంది. గెలుపొందిన సీనియర్ నేతల్లో నయాబ్ సింగ్ సైనీతో పాటు, కాంగ్రెస్ నేత భూపిందర్ సింగ్ హుడా, ఃఏఖ నేత అనిల్ విజ్ (అంబలా కాంట్), శ్రుతి చౌదరి (తోషమ్), ఎఔఒఆ అర్జున్ చౌతాలా తదితరులు ఉన్నారు.

# మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవం

మొదటి పేజీ తరువాయి...

సీఎం ప్రశ్నించారు. అసలు ప్రాజెక్టుకు ఎందుకు చేపట్టారో వివరించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నేతలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. మూసీ సుందరీకరణ అంశంపై వివాదం మరింత చెలరేగుతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి గురువారం మీడియా ముందుకు వచ్చారు. మూసీ వివాదంపై స్పష్టత ఇచ్చారు. తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశించే ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందన్నారు. 33 బృందాలు మూసీ పరివాహకంపై అధ్యయనం చేశాయని సీఎం తెలిపారు. మూసీ పరివాహకంలో నివసిస్తున్న వారు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని.. అలాంటి వారికి మెరుగైన జీవితం అందించాలని భావిస్తున్నామన్నారు. విద్యావంతుల నుంచి నిరక్ష్యరాస్యుల వరకు అందరికీ హైదరాబాద్ ఉపాధి కల్పించాలన్నారు. గత ప్రధానులు పంచవర్ష ప్రణాళికలతో దేశాన్ని అభివృద్ధి చేశారని.. గత ప్రధానులు సంస్కరణలు తెచ్చిన ప్రతిసారీ కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చిందని సీఎం గుర్తు చేశారు. 10 నెలలుగా అధికారులు నిద్రాహారాలు మాని మూసీపై పనిచేస్తున్నారని సీఎం తెలిపారు. మూసీ నదిలో పేదలు ఎదుర్కొంటున్న కష్టాలను అధికారులు గుర్తించారన్నారు. విప్లవాత్మక నిర్ణయాలను వ్యతిరేకించే వాళ్లు ఎప్పుడూ ఉంటారని అన్నారు. విషవలయంలో పేదలు ఉండాలనేది కొందరి ఆలోచన అంటూ విపక్షాలపై పరోక్షంగా సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. భూగరిష్ట పరిమితి చట్టాన్ని వ్యతిరేకించిన వర్గం కూడా దేశంలో ఉండేదన్నారు. పేదలు ఎప్పుడూ పేదలుగానే ఉండాలని దొరలు, భూస్వాములు భావిస్తారన్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు, అధికారులు రాష్ట్రాన్ని దోచుకున్నారని సీఎం ఆరోపించారు. తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదని.. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం అని చెప్పారు. కొందరి మెదడులో మూసీలో ఉన్న మురికి కంటే.. ఎక్కువ విషం నింపుకున్నారంటూ విపక్ష నేతలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విషపూరిత ఆలోచనలతోనే మూసీ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ప్రభుత్వ ఆలోచనగా




సీఎం పేర్కొన్నారు. 'మూసీ సుందరీకరణ కోసం ప్రణాళికలు రూపొందించామని కేటీఆర్ అనలేదా? అడ్డుకుంటున్న నేతలు 3 నెలలు మూసీ ఒడ్డున జీవించాలి. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల 3 నెలలు మూసీ ఒడ్డున ఉండాలి. వాళ్లు 3 నెలలు అక్కడ ఉంటామంటే కావాల్సిన వసతులు కూడా కల్పిస్తాం. ఆ ముగ్గురూ మూడు నెలలు అక్కడ ఉంటే.. ఈ ప్రాజెక్టును ఆపేస్తాం. మూసీ పరివాహకంలోనే ఉండి ప్రజల కోసం పోరాడాలి, వారి జీవితం బాగుందని నిరూపించాలి. మూసీ ప్రజల కోసం ఏం చేద్దామో అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇవ్వాలి. మూసీ పునరుజ్జీవం కోసం మీ వద్ద ఉన్న ప్రణాళిక చెప్పండి. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలి. విపక్ష నేతల సందేహాలు ఏమిటో చెప్పాలి' అని సీఎం ప్రశ్నించారు. మీడియా సమావేశంలో సిఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ డి ఈ (టెక్నికల్) గా పదవి బాధ్యతలు స్వీకరించిన ఎం శివశంకర్ ను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ డివిజన్ ఉద్యోగ 1104 సంఘం ప్రతినిధులు

## విద్యుత్ డిఈ శివ శంకర్‌ను సన్మానించిన అధికారులు, ఉద్యోగులు

మెహదీపట్నం, అక్టోబర్ 17(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ డి ఈ (టెక్నికల్) గా పదవి బాధ్యతలు స్వీకరించిన ఎం శివశంకర్ ను రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ ఉద్యోగ1104 సంఘం ప్రతినిధులు సన్మానించారు. గురువారం మెహదీపట్నంలోని నానల్ చౌరస్తా లోగల రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఈ కార్యాలయంలో రాజేంద్రనగర్ డివిజన్ 1104 యూనియన్ అధ్యక్షులు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి అజీమ్ ల ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘం ప్రతినిధులు ఎం శివ శంకర్ ను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. డి ఈ శివశంకర్ ను సన్మానించిన వారిలో యూనియన్ ప్రతినిధులు బాబురావు, లైన్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, లైన్ మాన్ ప్రసాద్, ఉద్యోగులు పద్మనాభం, తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఇబ్రహీంబాగ్ విద్యుత్ డివిజన్ డి ఈ గా పనిచేసి బదిలీ అయిన ఎం శివశంకర్ ను డివిజన్ పరిధిలోని శంకర్పల్లి సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రదీప్ కుమార్, కాంట్రాక్టర్ సుమన్, ఉద్యోగులు యుగంధర్, కృష్ణారెడ్డిలు సన్మానించారు.



ఇబ్రహీం బాగ్ పూర్వపు విద్యుత్ గా పనిచేసి బదిలీ అయిన ఎం శివశంకర్‌ను సన్మానిస్తున్న శంకర్ పల్లి ఏఈ ప్రదీప్ కుమార్, కాంట్రాక్టర్ సుమన్



## మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులుగా రామన్ గౌడ్

గద్వాల(కేటిదొడ్డి), అక్టోబర్ 17(ప్రభాత ఉదయం) పంచాయతీ కార్యదర్శుల సంఘం కేటిదొడ్డి మండల అధ్యక్షులుగా గంగన్ పల్లి పంచాయతీ కార్యదర్శి రామన్ గౌడ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు ఖాజామీర్ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షులుగా రామన్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా లింగన్న, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

## ఇబ్రహీం భాగ్ విద్యుత్ ఈఆర్ఓ జేఏఓగా ఎం భాస్కర్ రెడ్డి

గండిపేట, అక్టోబర్ 17(ప్రభాత ఉదయం) ఇబ్రహీం బాగ్ విద్యుత్ ఈ ఆర్ ఓ జే ఏ ఓ గా ఎం భాస్కర్ రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించారు. గురువారం నార్సింగి లోని విద్యుత్ డి ఈ కార్యాలయం ఆవరణలో గల ఈ ఆర్ ఓ లో భాస్కర్ రెడ్డి పదవి బాధ్యతలు స్వీకరించారు. పదవి బాధ్యతలు స్వీకరించిన భాస్కర్ రెడ్డిని విద్యుత్ ఉద్యోగ 1104 సంఘం ప్రతినిధులు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఇబ్రహీం బాగ్ విద్యుత్ ఈఆర్ఓ జేఏఓగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఎం భాస్కర్ రెడ్డి



మహర్షి వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

## ఘనంగా వాల్మికి మహర్షి జయంతి వేడుకలు

### కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్17(ప్రభాత ఉదయం)జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ నర్సింగరావు, జిల్లా బి.సి సంక్షేమ అధికారి రమేష్ బాబు, వాల్మీకి సంఘం నాయకులు గట్టు తిమ్మప్ప, ఆంజనేయులు, కౌన్సిలర్ మురళి, రాజు, మధుసూదన్ బాబు వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గోన్నారు.

# 23వ తేదీన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం

మొదటి పేజీ తరువాయి...

తెలుస్తోంది. ఈ మేరకు ఆయా శాఖల నుంచి వివరాలు సిద్ధం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ నెలాఖరున అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు సర్కారు ఏర్పాట్లు చేస్తోంది. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో హైడ్రాపై జోరుగా చర్చ సాగుతోంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, చెరువులను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను కూల్చేస్తూ హైడ్రా దూకుడుగా వ్యవహరిస్తోంది. పేదలు ఇళ్లు కోల్పోతున్నారంటూ ప్రతిపక్ష నేతలు హైడ్రాపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. అయినా, ప్రభుత్వం ఈ విషయంపై వెనక్కు తగ్గడం లేదు. అటు, రాజకీయ ప్రకంపనల మధ్యే ప్రభుత్వం తాజాగా హైడ్రాకు మరిన్ని బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీతో పాటు ఓఆర్ఆర్ వరకూ ఉన్న 27 పురపాలికల్లో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తు నిర్వహణకు అవసరమైన అధికారాలను కట్టబెట్టింది. ఈ ఆదేశాలతో జీహెచ్ఎంసీకి చెందిన రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ బాడీలు, బహిరంగ ప్రదేశాలు, పబ్లిక్ పార్కులు వంటి ఆస్తులను ఆక్రమణకు గురి కాకుండా హైడ్రా రక్షించనుంది. 'జీహెచ్ఎంసీ చట్టం – 1955' కింద అవసరమైన అధికారాలను హైడ్రాకు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.




## వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర అందరికి ఆదర్శం

### జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు

గద్వాల, అక్టోబర్ 17(ప్రభాత ఉదయం) దివ్య జ్ఞాన%శీ% తో రామాయణ మహాకావ్యాన్ని గొప్పగా రచించి ప్రపంచానికి అందించిన వాల్మికి మహర్షి జీవిత చరిత్ర ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు అన్నారు. గురువార ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఒక సామాన్య వ్యక్తిగా పుట్టి వేటగాని వృత్తి తో జీవితం గడిపి సప్తఋషుల బోధనల ద్వారా మహర్షి వాల్మీకి గా మారి అధ్బుతమైన రామాయణం గ్రంథాన్ని మనకు అందించిన మహనీయుడు వాల్మీకీ గారని, వారి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు మహా పురుషులవుతారు అనేదానికి వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర నిలువెత్తు నిదర్శనం అని, ఏ వయసులో అయిన పట్టు దళ తో పని చెస్తే విజయం సాధించవచ్చు అని నిరూపించారని కొనియాడారు. ఈ కార్యాలయంలో సాయుధ దళ డి.ఎస్పి నరేందర్ రావు, అడ్మినిస్ట్రేషన్ అధికారి సతీశ్, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ రాజు,ఆర్ ఐ లు వెంకటేష్, హరీఫ్,సూపరింటెండెంట్ లు, అయా విభాగాల అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

# షేక్ హసీనాపై అరెస్ట్ వారెంట్

మొదటి పేజీ తరువాయి...

రప్పిస్తామని, ఆమెపై అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని ఐసీటీ నూతన ప్రాసిక్యూటర్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆమెను స్వదేశానికి రప్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. హసీనా పాలనపై తీవ్ర నిరసన వ్యక్తంచేసిన విద్యార్థి సంఘాలు ఆమె భారత్‌లో ఉండటాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇదిలాఉంటే.. హసీనాను చట్టబద్ధంగా తమ దేశానికి అప్పగించాలంటూ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) భారత ప్రభుత్వాన్ని డిమాండు చేసిన సంగతి తెలిసిందే. మరోపక్క ఆమె దౌత్య పాస్‌పోర్టు రద్దయిన సంగతి తెలిసిందే. హసీనా హయాంలో ఎంపీలకు జారీ చేసిన దౌత్య పాస్‌పోర్టులను రద్దు చేసినట్లు బంగ్లా హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పాస్‌పోర్టు ఉన్నవారు కొన్ని నిర్దిష్ట దేశాలు వీసా లేకుండా ప్రయాణించే వీలు ఉంటుంది. ఆగస్టు 5న పదవి నుంచి దిగిపోయి భారత్‌కు చేరుకున్న తర్వాత బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. ఇదిలా ఉంటే.. హసీనాను బంగ్లాకు రప్పించడానికి యూనస్ ప్రభుత్వం అన్ని యత్నాలు చేస్తుందని ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ గతంలో పేర్కొంది. హసీనాను అప్పగించాలా, వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత భారత్‌పైనే ఉందని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు 45 మందిపై బంగ్లాదేశ్ ఇంటర్నేషన్ క్రైమ్ ట్రిబ్యునల్ గురువారం అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. అరెస్టు వారెంట్లు జారీ అయిన వారిలో అవామీ లీగ్‌కు చెందిన పలువురు నాయకులు సైతం ఉన్నారు. విద్యార్థుల ఉద్యమం నేపథ్యంలో జరిగిన మారణహోమం, ఇతర నేరారోపణలపై క్రైమ్ ట్రిబ్యునల్‌లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ మేరకు నిందితులను అరెస్ట్ చేయాలని కోరుతూ ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన రెండు పిటిషన్లపై జస్టిస్ మహ్మద్ గోలం ముర్తాజా మజుందార్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని చీఫ్ ప్రాసిక్యూటర్ మహ్మద్ తాజుల్ ఇస్లాం వెల్లడించారు. నవంబర్ 18లోగా షేక్ హసీనా సహా మొత్తం 46 మందిని అరెస్ట్ చేసి హాజరుపరచాలని ధర్మాసనం అధికారులను ఆదేశించింది. బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమం హింసాత్మకంగా సాగిన విషయం తెలిసిందే. ఉద్యమాన్ని అణిచివేసేందుకు షేక్ హసీనా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విద్యార్థి నేతలు ఆరోపించారు. హింసాత్మక ఘటనలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. నిరసనలు మరింత ఉధృతం కావడంతో షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌కు వచ్చారు. ఆమె ప్రస్తుతం భారత్‌లోనే ఆశ్రయం పొందుతున్నారు. హసీనా రాజీనామా తర్వాత నోబెల్ గ్రహీత, ఆర్థిక వేత్త మొహమ్మద్ యూనస్ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వం విద్యార్థి ఉద్యమంలో హింసకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నది.

# పకడ్బందీగా గ్రూప్-1 పరీక్షలు

## అధికారులను ఆదేశించిన సిఎస్ శాంతి కుమారి

హైదరాబాద్, అక్టోబర్ 17 (ప్రభాత ఉదయం): ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరిగే గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలను ఏవిధమైన పొరపాట్లు లేకుండా అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, సంబంధిత ఉన్నతాధికారులతో సీఎస్ సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. టీజీపీఎస్సీ కార్యాలయం నుంచి చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు, సచివాలయం నుంచి డీజీపీ జితేందర్, కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్, ఎస్పీడీసీఎల్ ఎండీ ముశ్రాఫ్ అలీ, రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు అనుదీప్, శశాంక్, గౌతమ్ తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ .. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు 34,383 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. హెచ్ఎండీఏ పరిధిలో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు సీఎస్ శాంతి కుమారి. టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు జరుగుతుండడంతో.. పరీక్షల నిర్వహణలో అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆధునిక సాంకేతికత, సోషల్ మీడియా యాక్టివ్‌గా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణ కూడా సవాలుతో కూడుకుంటున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏవిధమైన అపోహాలు, పుకార్లకు తావివ్వకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని మహేందర్ రెడ్డి సూచించారు.



## ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలి

### ధరూర్ మాజీ జెడ్పీటిసి పద్మావెంకటేశ్వర్ రెడ్డి

### వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17(ప్రభాత ఉదయం) రామాయణ రచయిత వాల్మీకి మహర్షిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ధరూర్ మాజీ జెడ్పీటిసి పద్మావెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ధరూర్ మండలం వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో అయా గ్రామాలలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భారతీయ సాహిత్యానికి ఆధ్యుడు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన రామాయణాన్ని అందించిన వాల్మీకి అడుగుజాడల్లో పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# రైల్ రిజర్వేషన్ కాల వ్యవధిలో మార్పులు

మొదటి పేజీ తరువాయి...

ఎటువంటి మార్పు లేదు. ఇప్పటికే వాటిలో బుకింగ్ వ్యవధి తక్కువగా ఉంది. ఇక విదేశీ పర్యటకులు మాత్రం 365 రోజుల ముందుగానే టికెట్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉండగా.. ఇందులోనూ ఎలాంటి మార్పు లేదు. ఇదిలా ఉంటే, గతంలోనూ రైల్వే ముందస్తు బుకింగ్ ప్రయాణానికి 60 రోజుల ముందే ఉండేది. దానిని 120 రోజులకు పెంచిన భారతీయ రైల్వే.. తాజాగా మళ్లీ మునుపటి వ్యవధికే మార్పు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయం నేపథ్యంలో ఐఆర్‌సీటీసీ షేరు విలువ 2 శాతం మేర క్షీణించి రూ.873 వద్ద ట్రేడవుతోంది. గడువు కుదింపు వల్ల ఆ మేర క్యాన్సిలేషన్లు తగ్గి ఐఆర్‌సీటీసీకి ఆదాయం తగ్గే అవకాశం ఉండడమే దీనికి కారణమని అనలిస్టులు చెబుతున్నారు.

# బిఆర్ఎస్ తెలంగాణ అస్తిత్వ పార్టీ

మొదటి పేజీ తరువాయి...

ఇవ్వలేదు. ఆఖరికి ఒక్క నవోదయ పాఠశాల కూడా ఇవ్వలేదు. తెలంగాణకు ఏం ఇచ్చారని అడిగితే ఎవరు చెప్పరు.. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు మాటలు రావు. కానీ పిల్లలను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారు. ఇక రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. 32 జిల్లాల్లో పార్టీ ఆఫీసులు ఉన్నాయి. ప్రతి జిల్లాలో బీఆర్ఎస్వీ సమావేశాలు జరగాలి. మండలం, నియోజకవర్గం స్థాయిలో కమిటీలు వేసుకుందాం. సమర్థవంతమైన విద్యార్థి నాయకులు ఉన్నారు. వారిని జిల్లాలకు పంపుదాం. మండల కమిటీ, కాలేజీ కమిటీలను భర్తీ చేసి కొత్త నాయకత్వాన్ని ఎంకరేజ్ చేసుకుందాం. ఎక్కడికక్కడ సోషల్ మీడియాలో క్రియాశీలక పాత్ర పోషించాలి. కేసులకు భయపడొద్దు.. లీగల్ సెల్‌ను బలోపేతం చేస్తున్నాం. విద్యార్థి నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం. బీఆర్ఎస్వీ లేని కాలేజీ ఉండొద్దు. విద్యార్థి నాయకులకు రాజకీయంగా అవకాశాలు ఇస్తాం. మున్సిపల్ చైర్మన్లు, జడ్పీ చైర్మన్లు ఇతర పదవుల్లో అవకాశాలు కల్పిస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

# రోడ్డు ప్రమాదంలో ప్రజా టైమ్స్ ఎడిటర్ పాగుల రాములు గౌడ్ దుర్మరణం



పాగుల రాములు గౌడ్



ప్రమాదానికి కారణమైన టీఎస్12 యుడి 2561 నెంబర్ టిప్పర్



లంగర్ హౌస్‌లోని ప్రైవేటు ఆసుపత్రి వద్ద రాములు గౌడ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న శాసనమండలి మాజీ చైర్మన్ కె. స్వామి గౌడ్, సీనియర్ పాత్రికేయులు మ్యాడం మధుసూదన్, బాలు, శ్రీకాంత్ తదితరులు

బుద్వేల్,అక్టోబరు17(ప్రభాత ఉదయం): ప్రజా టైమ్స్ ఎడిటర్, రాజేంద్రనగర్ సర్కిల్ ఎర్రబోడకు చెందిన పోగుల రాములు గౌడ్ (45 ) గురువారం మధ్యాహ్నం గండిపేట మండలం నేక్నాంపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఆయనకు భార్య గీత , కుమారుడు పవన్ కుమార్, కూతురు మానస లు ఉన్నారు. గురువారం మధ్యాహ్నం పని మీద నేక్నాంపూర్ వెళ్లి తిరిగి వస్తుండగా టీఎస్ 12 యూడి 2561 నెంబర్ టిప్పర్ డీ కొంది. ఈ ప్రమాదంలో రాములు గౌడ్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. రాములు గౌడ్ ది వికారాబాద్ జిల్లా, కుల్కచర్ల మండలం తిరుమలపూర్ గ్రామం. విద్యాభ్యాసం కోసం నగరానికి వచ్చి రాజేంద్రనగర్ లో చదువుకుంటూ హైదర్ గూడ ఎర్రబోడ లో స్థిరపడ్డాడు.

**అందరితో కలుపుకోలుగా ఉండేవాడు :**

రాములు గౌడ్ అందరితో కలుపుకోలుగా ఉండేవాడు. ఎప్పుడు నవ్వుతూ ఎదుటివారిని పలకరించేవాడు. ప్రజా ప్రతినిధుల జన్మదిన వేడుకల సందర్భంగా వారి యొక్క రాజకీయ ఎదుగుదల ను తన ప్రజా టైమ్స్ మ్యాగ్జిన్ లో ప్రచురించి వారిని ప్రోత్సహించేవాడు.

**రాములు గౌడ్ మరణ వార్త గురించి తెలుసుకుని హాస్పిటల్ కు వచ్చిన శాసనమండలి మాజీ చైర్మన్ కె. స్వామి గౌడ్ :**

ప్రజా టైమ్స్ ఎడిటర్ పి రాములు గౌడ్ మదన వార్త గురించి తెలుసుకున్న శాసనమండలి మాజీ చైర్మన్ కె. స్వామి గౌడ్ లంగర్ హౌస్ లో రాములు గౌడ్ ను ఉంచిన ఆసుపత్రికి వచ్చి మృత దేహాన్ని సందర్శించారు. అక్కడి నుంచి గోల్కొండ పోలీసులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురికి తరలించారు. ఆయనతోపాటు సీనియర్ పాత్రికేయులు మ్యాడం మధుసూదన్, ఏం బాలసుబ్రమణ్యం, యు శ్రీకాంత్ లు దగ్గరుండి సహకరించారు.

**కుమారుడు వచ్చాక సమాధి కార్యక్రమాలు :**

ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన కుమారుడు పవన్ కుమార్ స్వదేశానికి తిరిగి వచ్చాక సమాధి కార్యక్రమాలు జరగనున్నాయి. ఎర్రబోడలోని రాములు గౌడ్ నివాసంలో రెండు గంటల పాటు మృతదేహాన్ని ఉంచి అక్కడి నుంచి స్వ గ్రామమైన తిరుమలాపూర్ కు తీసుకువెళ్ల నున్నట్లు సమాచారం.

**సంతాపం వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధులు :**

ప్రజా టైమ్స్ ఎడిటర్ పి రాములు గౌడ్ మరణ వార్త గురించి తెలుసుకున్న మాజీ మంత్రి , మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి ఓ ప్రకటన లో సంతాపం వ్యక్తం చేశారు. రాములు గౌడ్ మంచి రిపోర్టర్ అని, భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ సంతాపం తెలియజేశారు. ఓ చురుకైన పాత్రికేయున్ని కోల్పోయామని శాసనమండలి మాజీ చైర్మన్ కె. స్వామి గౌడ్ అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు.



బీటీహెచ్ పూర్తి చేసి డిగ్రీ పట్టా తీసుకున్న విద్యార్థులతో బైబిల్ కాలేజీ యాజమాన్యం

## ఘనంగా హైదరాబాద్ బైబిల్ కాలేజీ 30వ వార్షికోత్సవం

బుద్వేల్, అక్టోబరు17(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ శివానగర్ కాలనీలో డోనాల్డ్ ఆశ్రమం ఆవరణలో గల హైదరాబాద్ బైబిల్ కాలేజ్ 30వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం సంస్థ ఆవరణలో పర్ల్ జూబ్లీ సెలబ్రేషన్స్ ను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ బైబిల్ కాలేజ్ బిషప్ డాక్టర్ బి.ఎస్ మోజెష్ కుమార్, రెవరెండ్ దొర మోజెస్ కుమార్ ల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా హైదరాబాద్ బైబిల్ కాలేజ్ 30 సంవత్సరాలుగా చేపడుతున్న ఆధ్యాత్మిక బైబిల్ కోర్సుల వివరాలు, వివిధ కార్యక్రమాలను తెలియజేస్తూ రూపొందించిన సోవనీర్ తో పాటు బిషప్ బిఎస్ మోజస్ కుమార్ రచించిన పవిత్రీకరణకు బైబిల్ ఆధారాలు అనే ఆధ్యాత్మిక పుస్తకాలను విదేశాలకు చెందిన రెవరెండ్ మైకెల్ కలహన్, రెవరెండ్ డోమియానస్ లు ఆవిష్కరించారు. ఇంటర్నేషనల్ పెంతుకోస్తు హోలీనెస్ చర్చ్ మొదటగా మారుటేరు లో ఉండేదని ఆ చర్చిలో సేవ అందించి సభ్యులుగా ఉన్న వారి రెండవ తరం ప్రతినిధులను వేదికపైకి పిలిచి సన్మానించారు. అనంతరం హైదరాబాద్ బైబిల్ కాలేజీలో బీటిహెచ్, సీటిహెచ్ అనే ఆధ్యాత్మిక బైబిల్ కోర్సులను పూర్తి చేసిన 18 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను బహుకరించారు . ఈ సందర్భంగా విదేశాలకు చెందిన రెవరెండ్ డాక్టర్ హూగ్ హెయ్ లే డిగ్రీ పట్టాలు పొందిన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. బైబిల్ శిక్షణను పూర్తి చేసిన విద్యార్థులు దేవుని సేవ చేస్తున్న సమయంలో అనేక ఇబ్బందులు, కష్టాలు తలెత్తుతాయని వాటిని తట్టుకుని ముందుకు సాగాలన్నారు . వివేకముతో నడుచుకుంటూ సత్య మార్గాన్ని ప్రజలకు తెలియజేసే వారిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బిషప్ జి ఆశీర్వాదం, బిషప్ ఏ సామ్యూల్ మోజెస్, బిషప్ ఆర్ పాల్ భాస్కర్, హైదరాబాద్ బైబిల్ కాలేజ్ ప్రిన్సిపాల్ జాలె బాబుజీ, మాజీ ప్రిన్సిపాల్ లు రెవరెండ్ టి. విజయ శేఖర్ , రెవరెండ్ కె డానియెల్, అధ్యాపకులు సిస్టర్ బాల రవి కుమార్, సిస్టర్ అనూష ఉదయ్ కిరణ్, సిస్టర్ పరిమిళ సాగర్ , రెవరెండ్ ఈ. మనోహరం తదితరులు పాల్గొన్నారు.



మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలతో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

## ఇళ్లు కోల్పోతున్న ప్రతి ఒక్కరికీ మూడింతలు పరిహారం చెల్లించి ఖాళీ చేయించండి..

**బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి**

**రాజేంద్రనగర్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి**

బుద్వేల్, అక్టోబరు17(ప్రభాత ఉదయం): మూసీ సుందరీకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కూల్చివేతలపై బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అత్తాపూర్‌లో ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పర్యటించారు. అత్తాపూర్ డివిజన్ లోని భరత్ కాలనీ,టీకేఆర్ కాలనీలు హైడ్రా మూసి ప్రాంతాలలో ఉన్నాయని,కాలనీలో ఉన్న ఇండ్లకు మార్కింగ్ వేయడంతో విషయం తెలుసుకున్న కంటెస్టెంట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి బాధితులను తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ...బాధితులకు బీజేపీ అండగా ఉంటుందంటూ ఆయన హామీ ఇచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు ఇవ్వకుండా ఇళ్లు కూల్చివేయడం దారుణమని,ఈ కూల్చివేతలను బీజేపీ సహించదని ప్రభుత్వంపై మండిపడ్డారు.పేదల బాధను పట్టించుకోకుండా ప్రభుత్వం బలవంతంగా కూల్చివేతలకు పాల్పడితే లక్ష మందితో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఇళ్లు కోల్పోతున్న ప్రతి ఒక్కరికీ మూడింతలు పరిహారం చెల్లించాకే ఇళ్లు ఖాళీ చేయించాలని కొండ విశ్వేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.అనంతరం నియోజకవర్గం కంటెస్టెంట్ ఎమ్మెల్యే,డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ...రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో హైడ్రా బాధితులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.బీజేపీ పార్టీ ప్రజలకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పామన్నారు.ఇక్కడ హద్దు బందు 5 ఏళ్ల క్రితం పెట్టారని అది తెలుసుకునే ప్రజలు ఇక్కడ ఇల్లు కట్టుకొని ఉంటున్నారన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చి మార్కింగ్ వేయడం దుర్మార్గపు చర్య అని ఆయన వ్యాఖ్యానించారు.ఈ విషయంపై ఎంత దూరమైనా వెళ్తామని వీలైనంత త్వరలో కోర్టు ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.అదేవిధంగా కూలగొట్టే ఉద్దేశం ఉన్నట్లయితే ప్రజల ఆస్తి నష్టానికి మూడు రెట్లు నష్టపరిహారం ఇచ్చిన తర్వాతే ఇక్కడికి రావాలని ఆయన స్పష్టం చేశారు.న్యాయం జరిగేంత వరకు పెద్ద ఎత్తున ధర్నాలు చేయడానికి సిద్ధమవుతామని, ప్రజలు అధైర్యపడొద్దని బీజేపీ పార్టీ అండగా ఉంటుందని స్థానికులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి,వై. శ్రీధర్, కొమురయ్య,గౌరీ శంకర్,అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్,వేణుగోపాల్ రెడ్డి,వెంకట్ రెడ్డి, అమర్,స్టార్ చిన్న ముదిరాజ్,స్థానికులు, కాలనీవాసులు,నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




అవగాహన ఒప్పందాలు మార్చుకుంటున్న అధికారులు

## మేనేజ్-డిజిటల్ ఇండియా బాషిణి విభాగాల మధ్య అవగాహన ఒప్పందం

బుద్వేల్, అక్టోబరు17(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్ టెన్షన్ మేనేజ్మెంట్ (మేనేజ్) గురువారం కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిజిటల్ ఇండియా ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ బాషిణితో వ్యవసాయంలో భాష అడ్డంకులను ఛేదించడానికి అవగాహన ఒప్పందం పై సంతకం చేశారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ శామ్యూల్ ప్రవీణ్ కుమార్ సమక్షంలో ఈ అవగాహన ఒప్పందం జరిగింది. భారత రాజ్యాంగం ద్వారా గుర్తించబడిన దేశంలోని 22 భాషలలో వ్యవసాయ విద్యా, విస్తరణ , పరిశోధన లో భాషా అవరోదాలను తగ్గించడానికి ఈ అవగాహన ఒప్పందం దోహదపడుతుందని శామ్యూల్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ అవగాహన ఒప్పంద పత్రాలపై మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ యోగితా రాణ, డిజిటల్ ఇండియా భాషిణి విభాగం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అమితాబ్ నాగ్ సంతకాలు చేశారు. బాషిని విభాగం ద్వారా ఇకముందు వ్యవసాయ సమాచారాన్ని పరిశోధన ఫలితాలను తమ తమ భాషలలో రైతులు వినడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజ్ అగ్రికల్చరల్ ఎక్స్ టెన్షన్ అండ్ అడ్మినిస్ట్రేషన్ భాగానికి చెందిన డాక్టర్ శరవనన్ రాజ్, డిప్యూటీ డైరెక్టర్ అత్తలూరి శ్రీనివాసచార్యులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి: జిఎం సాయి లక్ష్మి



రాజేంద్రనగర్, అక్టోబర్ 15(ప్రభాత ఉదయం) ప్రతి ఒక్కరు తమ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని జలమండలి రాజేంద్రనగర్ డివిజన్ జనరల్ మేనేజర్ సాయి లక్ష్మి సూచించారు. గురువారం భూగర్భ జలాలు పెంపొందించుకోవటానికి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి లక్ష్మి మాట్లాడుతూ... రోజురోజుకు భూగర్భ జలాలు అరగంటి పొద్దున్న నేపథ్యంలో భూగర్భ జలాలను సంరక్షించుకోవడానికి ప్రతి వర్షపు నీటి చుక్కలు వడసి పట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి రాజేంద్రనగర్ డివిజన్ డీజీఎం కాజా జోహార్, మేనేజర్ శ్రావ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇంద్ర యజ్ఞం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

## ఆధ్యాత్మిక వాతావరణంలో ఇంద్ర యజ్ఞం గ్రంథం ఆవిష్కరణ

బుద్వేల్, అక్టోబరు17(ప్రభాత ఉదయం):అత్తాపూర్ రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. కుల వర్ణ ప్రాంత వివక్ష లేకుండా ప్రజలంతా ఇంటిదగ్గర సరళమైన రీతిలో యజ్ఞం చేసుకునే విధానాన్ని తెలియజేస్తూ రూపొందించిన ఇంద్ర యజ్ఞం అనే పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు. అరుణాచలం పుణ్యక్షేత్రంలో భగవాన్ రమణ మహర్షి, కావ్య కంఠ గణపతి ముని ఆశీస్సులతో.. వేదములలో వివరించిన మంత్రముల ఆధారంగా ఈ పుస్తకం రూపొందించడమైనది. ఈ పుస్తకంలో సరళంగా యజ్ఞం చేసుకునే విధానాలను, మంత్ర భావములతో సహా శ్రీ గణపతి ముని గారు ప్రసాదించిన ఇంద్ర యజ్ఞంను వివరించినట్లు గ్రంథకర్త సూర్య ఫణిమాధవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ డీసీపీ శ్రీనివాసరావు, చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ విద్యాసాగర్ రెడ్డి విచ్చేశారు. విశిష్ట అతిథులుగా రాష్ట్రీయ సేవికా సమితి నుంచి గౌడ రమాదేవి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నుంచి రమా విశ్వనాథన్ విచ్చేశారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ గాయత్రీ తపోవనం ఆశ్రమ శిష్యులు అందరూ కలిసి మూలకర్తలుగా నిలిచి నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలందరితో కుల ప్రాంత వర్ణ, లింగ విచక్షణ లేకుండా సామూహికంగా ఇంద్ర యజ్ఞం చేయించారు. ఇదే మాదిరిగా సరళమైన రీతిలో ప్రతి ఇంట్లోనూ ఇంద్ర యజ్ఞం జరగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు



## పోమల్ గ్రామంలోని సీతాఫల్ ప్రాసెసింగ్ ప్లాంటును సందర్శించిన ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ నీరజ ప్రభాకర్

మహబూబ్ నగర్, అక్టోబర్ 17(ప్రభాత ఉదయం) నవాబ్ పేట మండలం పోమల్ గ్రామంలో పాలమూరు రైతు డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సీతాఫల్ ప్రాసెసింగ్ ప్లాంట్ ను శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి నీరజ ప్రభాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో.. మాట్లాడుతూ అధిక మార్కెట్ రేటు పొందాలంటే గుజ్జు రంగు మారకుండా ఉండేందుకు కావలసిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అంటూ సీతాఫలం మొక్కల్ని ఏర్పాటు చేసేందుకు సూచనలు ఇచ్చారు. విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మరిన్ని ప్రయోగాలు చేసి ఈ ప్రాసెసింగ్ ఉత్పత్తులు ఎక్కువ మార్కెట్ ధర పొందేందుకు అవసరమైన పరిశోధనలు చేపట్టాలని శాస్త్రవేత్తలను ఆదేశించారు. బాలనగర్ సీతాఫలం రకానికి భౌగోళిక గుర్తింపు రిజిస్ట్రేషన్‌కై ఉద్యాన వర్సిటీ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నట్లు ఆమె తెలిపారు. వర్సిటీ అధికారి డాక్టర్ ఎం. రాజశేఖర్ డాక్టర్ పిడిగం సైదయ్య, పాలమూరు రైతు డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి ,సొసైటీ మెంబర్లు రామ్మోహన్ రెడ్డి ,రాములు ,శ్రీరాం అంజనేయులు, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడిగే గజేందర్ గౌడ్ , నవపేట మండల బికెఎస్ ఉపాధ్యక్షులు రఘునందన్ రెడ్డి ,పోమాల్ అధ్యక్షులు హర గణపతి, మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ డి ఈ (టెక్నికల్)గా ఎం శివశంకర్



రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ డి ఈ (టెక్నికల్), ఆత్మీయ అధికారి ఎం శివ శంకర్ ను ఉద్యోగ 1104 యూనియన్ నేత ఎం భాస్కర్ రెడ్డి



నార్సింగి లోని ఇబ్రహీం భాగ్ డి ఈ గా పదవి బాధ్యతలు స్వీకరించిన రమేష్ చంద్ర ను సన్మానిస్తున్న డివిజన్ ఉద్యోగులు, సిబ్బంది



డి ఈ రమేష్ చంద్ర సన్మానిస్తున్న డివిజన్, ఈ ఆర్ వో ఉద్యోగులు, సిబ్బంది

**ఆత్మీయ అధికారి ఏం శివశంకర్‌కు ఘనంగా సన్మానం**

**ఎం శివశంకర్‌ను సన్మానించిన ఇబ్రహీం బాగ్ డివిజన్ విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది**

**ఇబ్రహీం బాగ్ నూతన విద్యుత్ డి ఈ రమేష్ చంద్ర కు ఘనంగా సన్మానం చేసిన ఉద్యోగ సంఘం**

మెహదీపట్నం/నార్సింగి, అక్టోబర్ 17(ప్రభాత ఉదయం) ఇబ్రహీం బాగ్ విద్యుత్ డివిజన్ పూర్వపు డి ఈ ఎం శివశంకర్, నూతన డి ఈ ఎం రమేష్ చంద్ర లను ఇబ్రహీం బాగ్ డివిజన్ లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. మెహదీపట్నం నానల్ నగర్ చౌరస్తాలోని రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ డి ఈ (టెక్నికల్), ఆత్మీయ అధికారి గా పేరొందిన ఎం శివశంకర్ ను పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల1104 సంఘం కంపెనీ అడిషనల్ సెక్రెటరీ, విద్యుత్ సైబర్ సిటీ సర్కిల్ రీజినల్ సెక్రటరీ ఎం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు, డివిజన్ ఉద్యోగులు సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డి ఈ ఎం శివ శంకర్ మాట్లాడుతూ... ఇబ్రహీం బాగ్ డీఈ గా పనిచేసిన మూడేళ్ల కాలంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిల సమన్వయంతో వినియోగదారులకు సేవలు అందించడంతోపాటు సంస్థ ఆదాయానికి కలిసి పనిచేశామన్నారు. ఒక అధికారి గానే కాకుండా కుటుంబ సభ్యుడిగా డివిజన్లో పనిచేస్తున్న అధికారి, ఉద్యోగి, సిబ్బందికి ఏ సమస్య వచ్చిన కుటుంబ సభ్యుడిగా తన వంతుగా బాధ్యతాయుతంగా పనిచేశానన్నారు. తాను బదిలీ అయిన సందర్భంగా మీరు చూపిన ప్రేమ మరువలేనిదని ఆయన ఈ సందర్భంగా ఉద్యోగులతో పాలుపంచుకున్నారు. అదేవిధంగా ఇబ్రహీం భాగ్ నూతన డి ఈ ఎం రమేష్ చంద్ర ను ఉద్యోగ సంఘం నేత ఎం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు, సిబ్బంది లు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డి ఈ రమేష్ చంద్ర మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ అందించాలని ఆశయంతో ముందుకు వెళుతుందని అందరం సమన్వయంతో కలిసి ప్రభుత్వ ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థ అభ్యున్నతి కోసం అందరం కలిసి పనిచేయడంతో పాటు విద్యుత్ వినియోగదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు ముందుకు సాగుదాం అన్నారు.

ప్రభాత ఉదయం

# గద్వాలలో భారీగా పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టాలి

### పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న గద్వాల అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి సభ్యత్వం నమోదు ఇంచార్జ్ బొక్క బాల్ రెడ్డి

### అసెంబ్లీ బిజెపి సభ్యత్వ నమోదు ఇంచార్జ్ బొక్క బాల్ రెడ్డి

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17(ప్రభాత ఉదయం) పార్టీ సభ్యత్వాన్ని భారీ సంఖ్యలో చేపట్టి ప్రజలకు మరింత చేరువ కావాలని పార్టీ శ్రేణులకు బిజెపి గద్వాల అసెంబ్లీ నియోజకవర్గం సభ్యత్వ నమోదు ఇంచార్జ్ బొక్క బాల్ రెడ్డి అన్నారు. గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం లో భాగంగా గద్వాల్ జిల్లా సభ్యత్వ నమోదు ఇంచార్జ్ బాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణమ్మ సారథ్యం లో జోగులాంబ గద్వాల్ జిల్లా ప్రజలు అందరూ అభివృద్ధి చెందుతారు అని అన్నారు.కోటి దాటి క్రియాశీల కార్యకర్తలు ఉన్న ప్రపంచం లోనే మొదటి రాజకీయ పార్టీ గా ఉన్న బీజేపీ ని మరింత బలోపేతం చేసే దిశగా కార్యకర్తలు కృషి చేయాలఎన్నారు.స్వయంగా ప్రధానమంత్రి మోడీ గారు 50 క్రియాశీల సభ్యత్వాలు చేసి,ఆయన కూడా ఒక క్రియాశీల కార్యకర్త గా నిలవడం అందరూ ఆదర్శంగా తీసుకుని పని చేయాలి అన్నారు. మొదట అలంపూర్ మున్సిపాలిటీ లో స్థానిక నాయకుల ను కలుపుకుని ప్రతి ఇల్లు,వ్యాపార సంస్థ తిరుగుతూ బిజెపి ద్వారా వారికి అందుతున్న పథకాలు వివరిస్తూ,పార్టీ లో జాయిన్ అయ్యేలా వారిని ప్రోత్సహించారు. అనంతరం విశ్వకర్మ జయంతి సందర్భంగా గద్వాల్ పట్టణం లో ఉన్న ప్రధానమంత్రి కౌశల్ సమ్మాన్ యోజన కేంద్రం సందర్శించారు.అరుణమ్మ గద్వాల్ ప్రజలకి,ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజల అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తారు అని,ఆమె నాయకత్వాన్ని



బలపర్చాల్సిన బాధ్యత ప్రజలు అందరూ తీసుకోవాలి అని అన్నారు.గద్వాల్ పట్టణం లో ప్రజలు పెద్ద సంఖ్యలో బీజేపీ సభ్యత్వ నమోదు చేసుకున్నారు.ఈ కార్యక్రమం లో జోగులాంబ గద్వాల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవదాస్, స్థానిక బీజేపీ నాయకులు నర్సింహ,చిత్తారి కిరణ్, గీతారెడ్డి,పాండు,శ్యామ్ సుందర్ రావు పాల్గొన్నారు.



సిఇ పి & ఎంఎంగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఆనంద్ సన్మానిస్తున్న ఎస్ ఈ శ్రీరామ్ మోహన్

## టీజీఎస్పీడీసీఎల్ సిజిఎం (పి & ఎం ఎం)గా పదవి బాధ్యతలు స్వీకరించిన ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎస్ ఈ శ్రీరామ్ మోహన్

హైదరాబాద్, అక్టోబర్ 17(ప్రభాత ఉదయం) తెలంగాణ దక్షిణ మండల విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సిజిఎం (పి %డ% ఎం ఎం) పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఈ. డి శ్రీరామ్మోహన్ శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం హైదరాబాదులోని మింట్ కాంపౌండ్ లో గల సిజిఎం ఆనంద్ కార్యాలయంలో ఎస్ ఈ శ్రీరామ్ మోహన్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. సిజిఎం ఆనంద్ కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ డి ఈ చంద్రశేఖర్, లత పాటు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ పత్తిపై కేంద్ర వివక్ష తగదు

### వరి, పత్తి పంటలకు ఎం,ఎస్పి, ని పెంచండి: కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి



కొత్తకోట, అక్టోబర్ 17 (ప్రభాత ఉదయం) రైతులు పండించే వివిధ పంటలకు కల్పించే కనీసం మద్దతు ధర విషయంలో కేంద్ర ప్రభుత్వం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా వ్యవహరించడం కేంద్ర ప్రభుత్వానికి తగదని కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గుజరాత్ పత్తికి మద్దతు ధర క్వింటాలు రూ.8,257 చెల్లిస్తున్న కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో పండిస్తున్న పత్తి కి మాత్రం రూ.7, 521,మాత్రమే చెల్లించడం దుర్మార్గమని అన్నారు.

**గుజరాత్ కు ఒక నీతి తెలంగాణకు మరో నీతా**

పత్తికి కేంద్రం చెల్లించే మద్దతు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఎందుకు ఉందని ప్రశ్నించారు.వన్ నేషన్, వన్ మార్కెట్,అంటూ ఊదరగొట్టే ప్రసంగాలతో రైతులను మోసం చేస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్ వన్ ఎం,ఎస్పీ, అని ఎందుకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2025-26 మార్కెటింగ్ సీజన్ కు గాను దక్షిణ భారతదేశంలో పండే వరి, పత్తి, పంటలకు వచ్చే రబీ సీజన్ లో కనీస మద్దతు ధరను పెంచాలని తెలంగాణలో పంటల సాగును ప్రోత్సహించి రైతులకు మెరుగైన ఆదాయం వచ్చేలా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు.

## వ్యవసాయ అధికారిణి మాధురిని సన్మానించిన రాచాల



కొత్తకోట, అక్టోబర్ 17(ప్రభాత ఉదయం) మండల వ్యవసాయ అధికారిణిగా ఉద్యోగం సాధించిన మండ్ల మాధురిని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ గురువారం ఘనంగా సన్మానించారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం వడ్డెవాట గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ మండ్ల తిరుపతయ్య, సరిత దంపతుల కుమార్తె మాధురి ఇటీవలే మండల వ్యవసాయ అధికారిణిగా ఉద్యోగం సాధించి వ్యవసాయ శాఖ వనపర్తి జిల్లా కార్యాలయంలో ఏవో (టెక్నికల్)గా ఉద్యోగ భాద్యతలు చేపట్టిన ఈ సందర్భంగా ఆమెను గ్రామంలోని నివాసంలో శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం రాచాల మాట్లాడుతూ అతి చిన్న వయసులో గెజిటెడ్, ర్యాంకు ఉద్యోగం సాధించి జన్మనిచ్చిన తల్లి తండ్రులకు మరియు జన్మించిన గ్రామానికి పేరు ప్రతిష్టలు తెచ్చినటువంటి మాధురిని చూసి యువత స్ఫూర్తి పొందాలన్నారు. ఉద్యోగ నిర్వహణలో రైతులకు నిస్వార్థంగా సేవలందించి, వారి అభివృద్ధికై కృషి చేయాలని ఆమెకు సూచించారు. 10 ఏళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకుండా నిరుద్యోగులని నిరాశపరిచారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లోనే ఎన్నో నోటిఫికేషన్లు వేల మంది నిరుద్యోగులకు న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి దక్కిందని, నిరుద్యోగుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాధురి తల్లి సరిత, నాయకులు గుంటిపల్లి బాలరాం,లక్ష్మణ్, మ్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జి ఎం ఆర్



కొత్తకోట, అక్టోబర్ 17 (ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం పామాపురం గ్రామంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాల్లో వాల్మీకులతో కలిసి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పాల్గొని వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి.ఎం.ఆర్ మాట్లాడుతూ, వాల్మీకి మహర్షి రామాయణ%శీ% రచించారని మహాభారత కావ్యాలు ప్రపంచ మానవాళి శాంతికి మానవ మనుగడ కి మార్గదర్శి అని ప్రతి ఒక్కరూ రామాయణ మహా భారత కావ్యాలను చదవి ఆచరించాలని వాల్మీకి మహర్షి అడుగుజాడల్లో నడవాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, చంద్రశేఖర్ రెడ్డి, బీచుపల్లి, కృష్ణారెడ్డి, బోయెజ్, మేస్త్రి శ్రీను, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, వేముల శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ రెడ్డి, రావులకరుణాకర్ రెడ్డి,మిషేక్,సుభాష్, సుజ్ఞానం,సందవెంకటేష్,నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## విద్యను కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు:


### పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ

కూకట్‌పల్లి,అక్టోబర్ 17 (ప్రభాత ఉదయం) ప్రతి ఒక్కరూ విద్యను కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలంగాణ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ వాసి కురీపి కుమారుడు సుజిత్ మోహన్ కు భారత్ విభూషణ్ అవార్డు నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్, లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, డాక్టరేట్ ఇన్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ మొదలగు అవార్డులు రావడంతో తెలంగాణ పిఎసి చైర్మన్ శేర్లింగంపల్లి ఎమ్మెల్యే ఆరేకెపూడి గాంధీ పాపిరెడ్డి నగర్ సీనియర్ నాయకుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డితో కలిసి సుజిత్ మోహన్ ను, వారి తండ్రిని అభినందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తిని ఇంకా మున్ముందు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమములో సింగిరెడ్డి భూపాల్ రెడ్డి, ఎల్లం నాయుడు, సతీష్ గుప్త శ్రీకాంత్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ నాగ లింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ. 50 వేల విరాళాన్ని అందించిన జిల్లా గణేష్

కూకట్‌పల్లి,అక్టోబర్ 17 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ దత్తాత్రేయ కాలనీలో గల శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి స్థల సేకరణలో భాగంగా రూ.50 వేల విరాళాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరేకపూడి గాంధీ జన్మదిన్నాన్ని పురస్కరించుకొని ఆలయ అభివృద్ధి కోసం 50 వేల రూపాయలు విరాళంగా ఇచ్చామని తెలిపారు. ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో ఇంకా ఉన్నత పదవులు పొందాలని కోరుకుంటున్నట్టు జిల్లా గణేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగభూషణం, అరుణ్, నాయకులు పి మహేష్, వెంకటకృష్ణ, సుధాకర్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మార్కెట్ యాడ్ చైర్మన్ కురువ హనుమంతు

## మహాకావ్య సృష్టికర్త వాల్మీకి

### మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంత్.. ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

గద్వాల(కేటిదొడ్డి), అక్టోబర్ 17(ప్రభాత ఉదయం) శ్రీమద్రామాయణ మహాకావ్య సృష్టికర్త మహర్షి వాల్మీకి అని, ఒక సామాన్య వ్యక్తిగా పుట్టిన బోయవాడు.. అడవిలో పెరిగి సప్తఋషు ల బోధనల ద్వారా మహర్షిగా మారాడని గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కురువ హనుమంతు, వాల్మీకి సంఘం కేటిదొడ్డి మండలాధ్యక్షుడు టీచర్ గోవింద్ అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం మండలాధ్యక్షుడు టీచర్ గోవింద్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు పార్టీ మండల అధ్యక్షుడు ఉరుకుంద హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కారవంతమైన సమాజ నిర్మాణానికి రామాయణ మహాకావ్యం బాటలు వేస్తుందని, ఇంతటి మహోన్నత గ్రంథాన్ని అందిం చిన వాల్మీకిని ప్రతీఒక్కరు స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి నాయకులు కొండన్న తయాప్ప, గద్వాల కర్రెన్న, వెంకటేష్ నాయుడు, ఆర్ వీరన్న, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.




## సమైక్య రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని అవినీతి కేసీఆర్ ప్రభుత్వం చేసింది

### తెలంగాణ రాష్ట్రంలో ప్రతీ వ్యక్తి మీద రెండు లక్షల అప్పుకి కారణం కెసిఆర్ పాలన కాదా...?

### సూటిగా ప్రశ్నించిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి,అక్టోబర్ 17 (ప్రభాత ఉదయం) రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొమ్మిది నెలల కాలంలో యెనభై వేల కోట్ల రూపాయల అప్పులు చేసారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ తొమ్మిది నెలల్లోనే ఎనభై వేల కోట్ల రూపాయల అప్పులు చేసారని ఈ రాష్ట్రాన్ని దివాళా తీయిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుందన్నారు. పదేళ్లు ఈ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత మీది కాదా అని ప్రశ్నించారు. సమైక్య రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని అవినీతి కేసీఆర్ ప్రభుత్వం చేసిందని, పదేళ్ల క్రితం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయినపుడు మిగులు బడ్జెట్ తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్ల పై చిలుకు అప్పులు చేసి ఈరోజు ప్రతి వ్యక్తి మీద 2లక్షల అప్పుకు కారణం మీరు కాదా అని ప్రశ్నించారు. మా ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక అరవై తొమ్మిది వేల కోట్లు అప్పు అయితే దాంట్లో యాభై వేల కోట్లు దాదాపుగా మీ గత ప్రభుత్వ అప్పుల వడ్డీలు కట్టేందుకే సరిపోయిందని, అందులో ఇరవై వేల కోట్లు రైతు రుణమాఫీ చేశామని, అనేక సంక్షేమ కార్యక్రమాలు చేసేది మీ కళ్ళకు కనపడుతుంటే అసలు ఆ మాటలు అనడానికి మీకు నోరెలా వచ్చిందని అన్నారు. హైదరాబాద్ మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లుగా నటిస్తూ అనేక అక్రమాలకు తెరలేపింది, అక్రమ జీవోలతో బిల్డర్స్ కి ఎక్కువ ఎస్ఎఫ్టి కి ఇచ్చి అక్రమాలకు పాల్పడింది, మూసి ప్రక్షాళన మొదలు పెట్టింది మీరు కాదా కేటీఆర్ అని ప్రశ్నించారు. అప్పుకు కాదు ఏది అనర్హం అన్నట్లుగా ప్రతి దాని మీద అప్పుల కుప్పగా ఈ రాష్ట్రాన్ని తాయారుచేసారు. మీరు చేసిన పాపాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కడిగే ప్రయత్నం చేస్తుంటే ప్రశ్నించే నైతిక హక్కు మీకు ఎక్కడిదని ప్రశ్నించారు.



## ప్రజా సమస్యల పరిష్కారం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి,అక్టోబర్ 17 (ప్రభాత ఉదయం) ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఇన్చార్జి దీపదాస్ మున్షి, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన గురువారం గాంధీ భవన్ లో నిర్వహించిన సమావేశానికి జీహెచ్ఎంసి నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వి.జగదీశ్వర్ గౌడ్, హాఫీజ్ పెట్ డివిజన్ కార్పొరేటర్ పూజిత గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లుపాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, రానున్న రోజుల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురేస్తామని తెలిపారు. ప్రజా వినతులు ఆలకించడం, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడం ప్రజా ప్రతినిధిగా నా బాధ్యత అని, ప్రజలకు అందుబాటులో ఉంటూ ముందుకు సాగుతున్నామని, మౌళికవసతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



## పార్చర్లలో సందె రాళ్ల పోటీలు

గద్వాల, అక్టోబర్ 17(ప్రభాత ఉదయం)వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని గురువారం ధరూర్ మండలం పార్చర్ల గ్రామంలో సందెరాళ్ల పోటీలు నిర్వహించారు. వాల్మీకి సంఘం నాయకులు వాల్మికి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన సందె రాళ్ల పోటీలలో మొదటి బహుమతి ప్రతాప్, రెండో బహుమతి సూరి, మూడవ బహుమతి అంపయ్యలు విజేతలుగా నిలువగా... వారికి రూ.16,000, రూ.7,000, రూ.6,000 నగదును బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వాల్మికి సంఘంనాయకులు, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.




బిసి కమిషన్ చైర్మన్ జి నిరంజన్ సన్మానిస్తున్న పాత బస్తీ కాపు సంఘం నాయకులు

## బిసి కమిషన్ చైర్మన్ జి నిరంజన్‌ను సన్మానించిన పాత నగరం మున్నూరు కాపు సంఘం నాయకులు

చార్మినార్, అక్టోబర్ 17(ప్రభాత ఉదయం) రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన జి నిరంజన్‌ను పాత నగర మున్నూరు కాపు సంఘం ఆద్వర్యంలో దసరా సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బి.సి. కమీ షన్ చైర్మన్ జి.నిరంజన్.పాత నగర మున్నూరు కాపు సంఘం ప్రెసిడెంట్ ఆకుల శ్రీరాములు,సంఘం ప్రతినిధులు ప్రభాకార్ రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.